ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 28 నవంబరు 2025



తొలి రోజు 42 సర్పంచ్.. 32 వార్డులకు నామినేషన్లు

- మొదటి విడతలో 85 సర్పంచ్ స్థానాలు, 748 వార్డులకు ఎన్నికలు

సిరిసిల్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ల పర్వం మొదలైంది. మొదటి విడతలో మండలాలు 85 సర్పంచులు, 748 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి 31 కేంద్రాల ద్వారా నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 42నామినేషన్లు, 32 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వచ్చాయి.


తొలి రోజు నామినేషన్ల వివరాలు

మండలం	సర్పంచ్	వార్డులు
రుద్రంగి	04	05
వేములవాడ	02	నిల్
వేములవాడ రూరల్	07	04
కోనరావుపేట	16	12
చందుర్తి	13	11
మొత్తం	**42**	**32**


తిరుమల శ్రీవారిసేవలో విప్

వేములవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

అభ్యర్థుల ఎంపికపై కుస్తీ



- మొదటి విడత నామినేషన్లకు రేపే గడువు
- పల్లె ఓట్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఫోకస్
- పల్లెల్లో రిజర్వేషన్ల లెక్కలతో ఆశావహులపై చర్చ
- మద్దతు కోసం ఆశావహుల ప్రయత్నాలు
- ముఖ్య నేతలతో ఆయా పార్టీల అధిష్ఠానాల చర్చలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల పోరులో మొదటి విడత నామిషన్ల గడువు శుక్రవారంతో ముగుస్తుంది. దీంతో రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కుస్తీ పడుతున్నాయి. ఎన్నికల కమిషన్ మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణలో గురువారం మొదటి విడత ఎన్నికలకు నామిషన్ల స్వీకరణ ప్రారంభించారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా పల్లెల్లో ఎన్నికల కోలాహలం ఏర్పడింది. ఆశావహుల్లో ఎవరు నిలబడతారు, ఎవరు గెలుస్తారనే చర్చ గ్రామీణుల్లో జోరుగా సాగుతోంది. ఇదే క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ, విపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తాజా రిజర్వేషన్ల ప్రకారం, సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులపైన పార్టీల నేతలు ఫోకస్ పెంచారు. జిల్లాలో 260 సర్పంచులు, 2268 వార్డు సభ్యుల స్థానాలు ఉండగా, తాజా రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్‌ల్లో 56 బీసీలకు రిజర్వ్ కాగా, మహిళకు 24 స్థానాలు, జనరల్‌గా 32 స్థానాలు ఉన్నాయి. వంద శాతం ఎస్టీ పంచాయతీలు 26 ఉండగా 11 మహిళలకు, 15 జనరల్‌కు కేటాయించారు.

మిగతా నాలుగు ఎస్టీ స్థానాల్లో రెండు మహిళలు, రెండు జనరల్‌గా ఉన్నాయి. ఎస్సీలకు 53 స్థానాలు కేటాయించగా, 24 మహిళలకు, 29 జనరల్‌గా ఉన్నాయి. జనరల్ స్థానాలు 121ఉండగా 58 మహిళకు, 63 జనరల్ స్థానాలుగా కేటాయించారు. 2268 వార్డుల్లో వందశాతం ఎస్టీ పంచాయతీల్లో 176 వార్డులు ఉండగా 88మహిళకు, 88 జనరల్, ఇతర 53 ఎస్టీ వార్డుల్లో 18 మహిళలకు, 35 జనరల్‌గా కేటాయించారు. 442 ఎస్సీ వార్డులలో 177 మహిళకు, 26 జనరల్‌గా ఉన్నాయి. 553 బీసీ వార్డుల్లో 222 మహిళకు, 331 జనరల్ స్థానాలుగా ఉన్నాయి. 1044 జనరల్ వార్డుల్లో 471 మహిళలకు, 573 జనరల్‌గా ఉన్నాయి.

దీని ప్రకారం, జనరల్ బీసీ రిజర్వుడు స్థానాల్లో ఆశావహుల నుంచి గట్టి పోటీ ఉండగా, ఎస్టీ ఎస్సీ పోటీ తక్కువగానే కనిపిస్తోంది. దీంతో అభ్యర్థులు ఎంపికపై, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల నాయకులు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఆశావహులు పార్టీల మద్దతు కోసం నేతల చుట్టూ తిరుగుతున్నారు.

అధికార కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం

అధికార కాంగ్రెస్ పార్టీలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జోష్ పెంచాయి. పోటీకి దూరంగా ఉన్న వాళ్లు సైతం మళ్లీ అనుకూలంగా రిజర్వేషన్లు ఉన్నవారు పోటీకి ముందుకు వస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కష్టంగా మారే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపితేనే రాబోయే పరిషత్, బల్దియా ఎన్నికల్లో సులువుగా నెగ్గుకురావచ్చని భావిస్తున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నీ తానై నడిపిస్తుండగా, ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మూడు రోజుల క్రితమే సంగీతం శ్రీనివాస్‌ను అధిష్ఠానం నియమించింది. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు, ఓటమిలతో నూతన అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ప్రాబల్యంపై ప్రభావం బయట పడుతుందని

మిగతా 8వ పేజీలో..

నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, జోనల్ అధికారులకు జిల్లా సాధారణ, వ్యయ పరిశీలకులు పీ రవి కుమార్, కే రాజ్ కుమార్‌తో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని అన్నారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్ బృందాలు నగదు, ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏమాత్రం నిర్లక్షం ప్రదర్శించవద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. ర్యాలీలను పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, భోజనాలు తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. రూ 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చుపై వివరించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు శేషాద్రి, భారతి, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీఓ షరీఫోద్దిన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

జిల్లాకు చేరుకున్న సాధారణ, వ్యయ పరిశీలకులు

- పీఆర్ అతిథిగృహంలో అందుబాటులో..

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సాధారణ, వ్యయ పరిశీలకులు పీ రవి కుమార్, కే రాజ్ కుమార్ గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ అధికారులు జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో అందుబాటులో ఉంటారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకునేవారు వారిని సంప్రదించవచ్చని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు.

కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం తనిఖీ..



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్, మీడియా సెంటర్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని ఆరా తీశారు. అన్ని వివరాలు రికార్డులో రాయాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు భారతి, ప్రకాష్, డీపీఆర్వో లక్ష్మణ్‌కుమార్, కంట్రోల్‌రూమ్, మీడియాసెంటర్ సిబ్బంది ఉన్నారు.

జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం 30రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ మహేష్ బీ గీతే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దని, నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించవద్దన్నారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ పరివర్తన, మహిళ సాధికారిత, సఖి కేంద్రాలు సంయుక్తంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల హక్కులకు భంగం కల్గిస్తే 1098 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ స్పెషలిస్ట్ దేవిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, జంగపల్లి రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, భైరి శ్రీవాణి, కడార్ల కల్పన, నాగుల వీణా, నందా లశంకర్, జిల్లా కమ్యూనిటి ఎడ్యూకేటర్ జనర్ధాన్, సఖి కేర్ వర్కర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను విమర్శించే స్థాయి కాదు

వేములవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ముఖ్యమైన బీఆర్ఎస్ నేతలది ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను విమర్శించే స్థాయి కాదని పట్టణ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజుతో కలిసి గురువారం పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడలో వందల కోట్లతో జరుగుతున్న పనులను చూసి కేసీఆర్, కేటీఆర్, చల్మెడలే ఏం మాట్లాడడం లేదనిన్నారు. అభివృద్ధిపై మాట్లాడాల్సిన వ్యక్తిని జర్మనీ పంపించారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలపై ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తే, 144 మంది లబ్ధిదారులతో బీఆర్ఎస్ నేతల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాబోయే మున్సిపల్, స్థానికసంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ నాయకులు చిలుక రమేష్, కూరగాయాల కొమురయ్య, ఖమ్మం గణేష్, పుల్కం రాజు, పలి రాంబాబు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వ్యాధులకు సకాలంలో చికిత్స అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డయాబెటిస్, రక్తపోటు, క్యాన్సర్ సంబంధిత వ్యాధులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలతో ఆరోగ్య కేంద్ర పథకాలపై డీఎంహెచ్‌వో రజిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలు 100 శాతం సాధించాలని అన్నారు. కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాల సాధనలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డయాబెటిస్, రక్తపోటు, క్యాన్సర్ సంబంధిత వ్యాధులను సకాలంలో చికిత్స అందిస్తూ వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, అనిత, నహిమ, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామపంచాయితీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు సన్నద్ధం కావాలని ఎస్పీ మహేస్ బీ గీతే ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం సమీక్షా సమావేశాన్ని ఎస్పీ మహేష్ బీగీతే నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహిద్దామని తెలిపారు. జిల్లాలో మూడు విడుతలలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిస్థాయి పటిష్ట భద్రత ఏర్పాట్లతో ప్రశాంత వాతవరణంలో నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఇప్పటికే అనుభవం ఉన్న అధికారులు, సిబ్బంది నూతనంగా డిప్లాయ్ అయిన సిబ్బందికి మార్గదర్శనం చేస్తూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తూ అక్రమ మద్యం, నగదు, ఉచితాల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డైనమిక్ చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ అధికారులు తరచుగా పర్యటిస్తూ పరిస్థితులను నియంత్రణలో ఉంచాలని తెలిపారు. ఎన్నికల అనంతరం నిర్వహించే విజయోత్సవ ర్యాలీలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్థులతో పాటు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడేవారు, రౌడీషీటర్స్‌లపై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచి, అవసరమైతే బైండోవర్ చేయాలని ఆదేశించారు.

సోషల్ మీడియాపై మరింత నిఘా

గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లలో సోషల్ మీడియాపై నిఘా కఠినతరం చేసి విద్వేషాలు రెచ్చగొట్టేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు పోస్ట్ చేసిన, షేర్ చేసినవారితో పాటు గ్రూప్‌అడ్మిన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పశు వైద్యశాల భవనం

8

పీపుల్స్‌వార్ మాజీ దళకమాండర్ సిద్దయ్య దారుణ హత్య

నేడు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్

సిరిసిల్ల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రంగినేని ట్రస్టులో శుక్రవారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్... సంబురాలు నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ముఖ్య నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణ శివారులోని రంగినేని ట్రస్టులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 4.30 నిమిషాలకు వరకు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్టు ఉంటుందన్నారు. అనంతరం మ్యాజిక్ ప్రదర్శన, గాన కళాకారులతో పాటలు, ముఖ్య అతిథుల సందేశాలు, జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్టులో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు, శాస్త్రవేత్తల బుక్కుల ప్రదానం ఉంటుందన్నారు. జిల్లా స్థాయి చికుముకి సైన్స్ పోటీలో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్నం బోజన వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి పారం లక్ష్మీనారాయణ, కోశాధికారి మెడపట్ల కిషన్, సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన రామగుండం ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో రామగుండం జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేయడంతో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రామగుండం నియోజకవర్గానికి కొట్లరూపాయల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. రామగుండం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను నిర్మించాలని మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిందన్నారు. దీనికోసం ముఖ్యమంత్రి, మంత్రులను కలిశానన్నారు. నేడు రామగుండం ప్రజల కలసాకారం అయ్యిందన్నారు. 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగఅవకాశాలు రావడంతో పాటు రామగుండం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 7,250 రూపాయలు పలికింది. మార్కెట్ యార్డుకు బుధవారం 56 మంది రైతులు 462 క్వింటాళ్ల విడి పత్తి ఎనిమిది మంది రైతులు 11 క్వింటాళ్లు విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7250 రూపాయలు, కనిష్ఠ ధర 5,700 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి



గణేష్ (ఫైల్)

ఓదెల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చెరుకు గణేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. గణేష్ చదువును మానేసి స్వగ్రామం ఓదెలలోనే ఉంటున్నాడు. గత శుక్రవారం తన ఇంటిలోనే పురుగుల మందు తాగాడు. స్నేహితులు యువకుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. యువకుడి ఆరోగ్యపరిస్థితి విషమించడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అక్కడ మృతిచెందాడు. ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రేమవ్యవహారంగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆత్మహత్యకు ముందు ఒక పేపర్‌పై రాసి పురుగుల మందు తాగినట్లు సమాచారం. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు రాలేదని పొత్కపల్లి ఎస్‌ఐ తెలిపారు.





రాజన్న సన్నిధిలోని శిలా శాసనం, భీమన్న ఆలయంలో విగ్రహాలు

ప్రాచీన శిలా శాసనాలకు భద్రతేది?

పురావస్తు మ్యూజియం ఏర్పాటుకు ఎదురుచూపులు

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దేవస్థానంలో ఉన్న ప్రాచీన శిలా శాసనాలకు భద్రత కరువైంది. దాదాపు 1300 సంవత్సరాల క్రితం అప్పటి పాలకులైన చాళుక్యులు, కల్యాణీ చాళుక్యుల కాలంలో ఆరుకు పైగా శిలా శాసనాలు, జైన, బౌద్ధ, చాముఖులు, నాగముఖలింగ విగ్రహాలు నెలకొల్పారు. వీటితో పాటు వినియోగంలో లేని లింగాలు, వీరభద్రుడి విగ్రహాలు భీమన్న సన్నిధిలో ఉన్నాయి. వీటి వల్ల వేములవాడ చారిత్రక ప్రాశస్త్యం తెలుసుకునే వీలుంది. ఇవేకాకుండా వందల ఏళ్ల నాటి ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, పుస్తకాలు, ఫోటోలు ఉన్నాయి. అలాగే పురాతన కాలనాటి ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచాయతనాలు, అద్దాల మండపంలోని శిల్పాలు, స్తంభాలు ఉన్నాయి. వీటన్నింటికీ భద్రత కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ ప్రాచీన శిలా శాసనాలు, విగ్రహాలను పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి మ్యూజియంలో భద్రపరుస్తామని చెప్పారు. కాని ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేసి శిలా శాసనాలను భద్రపర్చాల్సిన అవసరం ఉంది.

విస్తరణలో భాగంగా మ్యూజియం నిర్మించాలి..

నాగేంద్రశర్మ, చరిత్రకారుడు

రాజన్న సన్నిధిని విస్తరిస్తున్న క్రమంలో శిలా శాసనాలు భద్రంగా ఉండడానికి అవసరమైన మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఈ విషయమై ఈవో రమాదేవి, విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించాను. ఇప్పటికైనా పురావస్తు శాఖకు దేవస్థానం లేఖ రాసి తగిన ఏర్పాట్లు చేయాలి.

శిలా శాసనాలను పదిలంగా భద్రపరిచాం..

ఎల్. రమాదేవి, రాజన్న ఆలయ ఈవో

రాజన్న, భీమన్న ఆలయాల్లో ఉన్న పురాతన శిలా శాసనాలను, విగ్రహాలను పదిలంగా భద్రపరిచాం. ఈ విషయమై పురావస్తు శాఖకు లేఖ రాస్తాం. తప్పకుండా శిలా శాసనాలను మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.



నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- వేగవంతం చేయాలని రైతుల డిమాండ్



కొనుగోలు కేంద్రంలోని ధాన్యం

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 24కేంద్రాలు, ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసిన రైస్‌మిల్లులను అలాట్ చేయడం కొంత ఆలస్యం కావడంతో వల్ల ధాన్యం సేకరణ ఆలస్యం అవుతోంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి పక్షం రోజులు గడిచిపోతున్నా తూకం వేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రాల నిర్వాహకులు, అధికారులు తమ తేమశాతం రాకపోవడం వల్లనే ఆలస్యం అవుతోందని పేర్కొంటున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని కోరుతున్నారు.

కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు..

అన్నదాతకు తిప్పలు..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. విక్రయించేందుకు అన్నదాతలు తరలించి నెలరోజులవుతున్నా సకాలంలో తూకం వేయకపోవడంతో పడిగాపులు కాయాల్సిన వస్తోంది. ఓవైపు సాగు పనులు, మరోవైపు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు ఇక్కట్లపాలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. లారీల కొరత, తూకం వేయడంలో జాప్యం వల్ల కేంద్రాల్లోనే వేచి ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



వీర్నపల్లిలోని కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

పిచ్చి కుక్క స్వైరవిహారం

- ఐదుగురికి గాయాలు

పెగడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఉదయం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. మోడల్ స్కూల్ పరిసరాల్లో ఐదుగురిని కరిచి తీవ్రంగా గాయపరచగా ఇద్దరు జగిత్యాల ఆస్పత్రిలో చేరారు. గ్రామానికి చెందిన మల్యాల సత్యమ్మ, పెంజర్ల శ్రీనివాస్, కొత్వాల్ సాయిలు, పద్మాల రాజవ్వ, రంగారావులను కరవగా తీవ్రగాయాలైన మల్యాల సత్యమ్మ, పెంజర్ల శ్రీనివాస్‌లను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన బాలె మల్లీశ్వరి (38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లీశ్వరి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది మల్లీశ్వరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త బాలె గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ఆరు టిప్పర్ల పట్టివేత



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక టిప్పర్లు

దర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దర్మపురి మండలంలోని ఆరెపల్లి శివారులో బుధవారం అర్ధరాత్రి ఆరు ఇసుక టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పక్కా సమాచారం మేరకు దర్మపురి తహసీల్దార్ ఏడుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నిఘా వేసి ఆరు టిప్పర్లను పట్టుకున్నారు. అనంతరం ఐదు ఇసుక టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు, ఒక ఇసుక టిప్పర్‌ను మండల రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ఇసుక విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్‌ఐ బాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.మహేష్ తెలిపారు.

● పోలీసుల కళ్లు గప్పి ఇసుక తరలింపు

దర్మపురి మండలంలోని ఆరెపల్లి, దర్మపురి గోదావరి నది నుంచి కొంతకాలంగా అక్రమార్కులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అనంతరం జగిత్యాల, దర్మపురి, రాయపట్నం ప్రధాన రహదారుల గుండా కొందరు వ్యక్తులు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రోజుకు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణా విషయమై పోలీసులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇసుక డంప్‌ల స్వాధీనం..

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని బొమ్మెన, గంభీర్‌పూర్, తక్కళ్ళపల్లి గ్రామాల రోడ్ల వెంట నిల్వ ఉంచిన ఇసుక డంపులను పట్టుకున్నామని ఆర్‌ఐ రవీందర్ తెలిపారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఐరెగేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు చేశామని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎండీ అమీర్‌ఖాన్(18) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. హుస్సేనిపురకు చెందిన అమీర్‌ఖాన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు పనిముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు.

గాంధీ చౌరస్తా నుంచి నాకా చౌరస్తా దారిలో బైక్‌ను వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అమీర్‌ఖాన్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న శంకరపట్నం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో అక్రమంగా నిలువ ఉంచిన రూ.15 వేల మద్యం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ మద్యం నిలువ, రవాణాపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. గురువారం అందిన సమాచారంతో దుర్శేడ్ గ్రామంలో ఊర్మిళ నివాసంలో తనిఖీ చేయగా మద్యం పట్టుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం కన్నాపూర్, లింగాపూర్‌లో కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం బెల్ట్ షాపులపై దాడి చేశారు. అక్రమంగా నిలువ చేసిన మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. కన్నాపూర్ గ్రామానికి చెందిన పంజాల రమేష్, పంజాల సత్యనారాయణ, లింగాపూర్‌కు చెందిన పచ్చిమట్ల నారాయణ నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడి చేసినట్లు, వారి వద్ద నుంచి సుమారు 21,000 రూపాయల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వీణవంక: వీణవంక మండలం రెడ్డిపల్లిలో సుమన్ బెల్ట్ షాప్‌పై పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 8,760 రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

చందుర్తి: రెండు గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.12,395 విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆనంద్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని జోగాపూర్ కిష్టంపేట గ్రామాల్లోని రెండు ఇళ్లలో అక్రమంగా మద్యాన్ని నిల్వచేసినట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో జోగాపూర్‌లో గడ్డం అంజయ్య ఇంట్లో 6,725 రూపాయల విలువగల మద్యాన్ని, కిష్టంపేటలో వాంకె అనిత ఇంట్లో 5,670 రూపాయల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గడ్డం అంజయ్యతో పాటు వాంకె అనితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 9న ఆదిలాబాద్‌కు చెందిన సిద్ధార్థ పవార్ తన సెల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ మహబూబాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్ యజమానిని గురువారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అందజేశారు. ఫోన్ రికవరీకి కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యం

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నూకపల్లి అర్బన్‌హౌజింగ్ కాలనీకి చెందిన తనికి ప్రమీల అనే వృద్ధురాలు బుధవారం నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ప్రమీల ఇంటికి తిరిగి రాలేదని పలు చోట్ల వెతికిన ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. వృద్ధురాలి కొడుకు నరేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని యువకుడి మృతి

ఓదెల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓదెల-కొలనూర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాల వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి వయసు 30-35 మధ్య ఉంటుందని, గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి పడి మృతి చెంది ఉంటాడని రైల్వే అధికారులు భావిస్తున్నారు. మృతుడు బ్లూ ఫుల్ టీషర్టు, దానిపై తెలుపు డిజైన్, స్కై బ్లూకలర్ లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి తిరుపతి వెళ్లే టికెట్ లభించింది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, వస్తువులు లేవు. మృతదేహాన్ని రామగుండం జనరల్ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు, కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. వివరాలు తెలిస్తే 9949304575 నంబర్‌కు తెలపాలని కోరారు.

28 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపుల నిర్వాహకులు, పాత నేరస్థులు 13 మందితోపాటు సస్పెక్ట్ షీటర్స్, కమ్యూనల్ షీటర్స్ 15 మందిని గురువారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 28 మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరచినట్లు, నేర మనస్తత్వం, అక్రమ దందాలకు పాల్పడకుండా లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు వివరించారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా గురువారం కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్, మొగ్దుంపూర్, చామనపల్లి, చెర్లభూత్కూర్, చేగుర్తిలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపు నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులను తహసీల్దార్ ముక్తార్‌పాషా ఎదుట హుజురునిసాచామని పోలీసులు గురువారం తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మద్యం అనుబంధ దుకాణాల నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులు క్రమశిక్షణతో నడుచుకోవాలని సూచించారు.

మాజీ మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మ దహనం



హరీష్‌రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఏర్పాటు చేయనున్న 800మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌పై మాజీమంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మహంకాళిస్వామి, గట్ల రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రామగుండానికి ఒక్క ప్రాజెక్టును కూడా తీసుకురాకపోగా అభివృద్దిని అడ్డుకుంటున్నారన్నారు. జెన్‌కో స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను ఏర్పాటుతో ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. కానీ ఎన్‌టీపీసీ, జెన్‌కో బిడ్డింగ్‌పై హరీష్‌రావు అవగాహన లేకుండా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, కొటం సతీష్, గడ్డం శ్రీనివాస్, పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి



నాయకులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం నవంబరు 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్న అంబేడ్కర్ చౌక్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కేసీఆర్ నిరాహార దీక్ష ముఖ్య మట్టమని అన్నారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కల రామారావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఆరుణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అవసరాలకు ఇండోర్ సబ్‌స్టేషన్

- ● నిరంతర సరఫరాకు ముందస్తు ప్రణాళికలు
- ● రూ.4.5 కోట్లతో కరీంనగర్‌లో ఏర్పాటు

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చడానికి టీజీ ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఇండోర్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. కరీంనగర్ మహాత్మా జ్యోతి బాపులే పార్కులో ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేసవి కాలంలో ఓవర్‌లోడ్, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుంది.

నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం..

మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



భవిష్యత్తులో విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నాం. 12 అడుగుల ప్రహరీ నిర్మిస్తున్నాం.. ఈ సబ్‌స్టేషన్‌తో పలు ప్రాంతాలకు లోవోల్టేజీ సమస్యలు తీరుతాయి.

ప్రయోజనాలు

ఇండోర్ సబ్ స్టేషన్‌ను నాలుగు గుంటల స్థలంలో నిర్మించవచ్చు. సంప్రదాయ అవుట్ డోర్ సబ్ స్టేషన్ సుమారు 20 గుంటల నుంచి ఎకరం వరకు స్థలం అవసరం ఉంటుంది. ఇండోర్ సబ్‌స్టేషన్‌తో లోవోల్టేజీ సమస్యలను తగ్గించవచ్చు. లైన్ పొడవు తక్కువ ఉండడం వల్ల విద్యుత్ అంతరాయాలను నివారించవచ్చు. కరీంనగర్ మహాత్మా జ్యోతిబాపులే పార్కులో ఏర్పాటు చేస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో ముకరంపుర, బస్టాండ్, గీతాభవన్, ఐబీ చౌరస్తా, జ్యోతినగర్, సంతోష్‌నగర్ ప్రాంతాలు వస్తాయి. ఈ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 15 మెగావాట్ల లోడ్ అవసరం అవుతుంది. భవిష్యత్తులో విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరిగేకొద్దీ లోడ్ పెరుగుతుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుని ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ లాంటి ప్రాంతాలలోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి సారి కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్నారు.



కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే పార్కులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్

మల్లెగుట్ట మల్లన్నకు నాగవెల్లి పట్నం



మల్యాల నుంచి బోనాలతో వెళ్తున్న భక్తులు

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల శివారులో గల మల్లెగుట్ట మల్లన్న సన్నిధి షష్టి దండి వారం సందర్భంగా సందడిగా మారింది. బుధవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గుట్టపైకి చేరుకోగా ఒగ్గు పూజారులు మల్లన్నకు కల్యాణం నిర్వహించారు. కాగా గురువారం భక్తులు బోనాలతో వెళ్లి స్వామి వారికి సమర్పించగా నాగవెల్లి పట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. దండి ఏడు వారాల పాటు ఇక్కడ పూజలు జరగనుండగా వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్నారు.

దత్తాత్రేయ నవరాత్రోత్సవాలు ప్రారంభం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయస్వామి నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్థానిక లక్ష్మీనరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే గల దత్తాత్రేయస్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలకంరణ చేసారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ వంశపారంపర్య అర్చకులు ద్యారం గిరిప్రసాద్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు కలశ పూజ, రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీసూక్తంతో అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్య-నరేందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమ్మేళనానికి నర్సింహులపల్లి విద్యార్థులు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) వారు నిర్వహించే అంతర్జాతీయ శతాధిక బాలరచయితల సమ్మేళనానికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి జిల్లాపరిషత్ విద్యార్థులు ఎంపికయ్యారు. నవంబరు 30న, తానా ప్రపంచ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో 13గంటల పాటు నిర్విరామంగా బాలసాహిత్య భేరి కార్యక్రమం నిర్వహిస్తారు. కథ, గేయం, వచన కవిత, పద్యం విభాగాల్లో పోటీలు జరుగుతుండగా ప్రపంచ వ్యాప్తంగా 101మంది విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో నర్సింహులపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గంగారపు శృతి, దారవేణి అశిత, అలిశెట్టి రాహుల్, సింగం శశాంత్, గన్మకుల లవన్‌కుమార్ కథ, వచనకథ విభాగాల్లో జూమ్ వేదిక ద్వారా పాల్గొననున్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి రామచంద్రారెడ్డి, కందుకూరి భాస్కర్ అభినందించారు.



అంతర్జాతీయ కథల సమ్మేళనానికి ఎంపికైన విద్యార్థులు



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నమూనా

ఎడ్యుకేషనల్ హబ్‌గా చొప్పదండి

రుక్మాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్

రూ. 200 కోట్లతో స్కూల్ ఏర్పాటు

రుక్మాపూర్‌లో నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 200 కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. స్కూల్ కోసం 25 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. స్కూల్‌లో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ బోర్డులు, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో స్కూల్‌ను నిర్వహిస్తారు. నాణ్యమైన విద్యను అందించి ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా తీర్చిదిద్దుతారు.

చొప్పదండి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషనల్ హబ్‌గా చొప్పదండి మారుతోంది. జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న రుక్మాపూర్ ప్రభుత్వ భూములలో మరో ప్రతిష్టాత్మకమైన విద్యాలయం ఏర్పాటు కానుంది. నియోజక వర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం చొప్పదండి మండలంలోనే ప్రతిపాదించగా ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండిలో నెలకొనగా, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ మొట్ట మొదటి సైనిక్ స్కూల్‌ను రుక్మాపూర్‌లోనే నెలకొల్పారు. తాజాగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రుక్మాపూర్ ప్రభుత్వ భూములలో 25 ఎకరాలను కేటాయించారు.

సామాజిక సమైక్యతను పెంపొందించడమే లక్ష్యం

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ప్రతి నియోజకవర్గానికి ఒక స్కూల్‌ను మంజూరు చేయగా, సామాజిక సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సమ్మిళిత విద్య, సమానత్వ సమాజాన్ని నిర్మించే ముఖ్య లక్ష్యాలతో స్కూల్‌ను రూపొందించారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో కుల, మత బేధం లేని వాతావరణం ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలతో సమగ్ర నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించి ఏకీకృత విద్యార్థి సంఘాన్ని సృష్టించి సామాజిక విభజనలను తొలగించడం కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

చొప్పదండి కేంద్రంగా విద్యాలయాలు

చొప్పదండిలో ఇప్పటికే నవోదయ విద్యాలయం, సాంఘిక సంక్షేమ సైనిక్ స్కూల్ ఉండడంతో తాజాగా అత్యుత్తమ స్కూల్‌గా అవతరించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రావడంతో చొప్పదండి మండలం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారనుంది. దేశ రక్షణ రంగాల్లో చేరేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సైనిక్ స్కూల్ ఉండగా, కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నడిచే జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండిలోనే ఉండడం విశేషం. మండలంలోని రుక్మాపూర్‌లో సైనిక్ స్కూల్, మోడల్ స్కూల్, కస్తూరిబా విద్యాలయాలు ఉండగా, ఇక్కడే యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు కానుండం విశేషం. రుక్మాపూర్‌లో నాలుగు ప్రతిష్టాత్మక ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు కావడం విశేషం.



చొప్పదండిలోని నవోదయ విద్యాలయం



రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్

ఎస్‌యూలో ప్రశాంతంగా యూజీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 3,5వ సెమిస్టర్ పరీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ 5వ సెమిస్టర్ పరీక్షలకు 2,619 మంది విద్యార్థులకు 2,497 మంది హాజరైనట్లు తెలిపారు. నలుగురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు 10,991 మంది విద్యార్థులకు 10,579 మంది హాజరైనట్లు తెలిపారు. ఇద్దరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు వెల్లడించారు.

ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న విశ్వవిద్యాలయ, అనుబంధ కళాశాలలకు ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరిక్ష ఫీజు షెడ్యూల్ గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబరులో ఉంటాయని పేర్కొన్నారు. డిసెంబరు 5వ తేదీలోగా పరీక్షలు చెల్లంచాలని తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 9 వరకు అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి 1,338 క్యూసెక్కుల వరద

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



లీగ్ పోటీల్లో తలపడుతున్న హైదరాబాద్-మెదక్ జట్లు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అండర్14 విభాగంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరిగా జరుగుతున్నాయి. మండలం లోని నందిమేడారం లోని బాలుర గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఈపోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి 240మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 10 జిల్లాల జట్లను ఏ-పూల్ 5జట్లను, బీ-పూల్‌గా 5జట్లను విభజించారు. బుధవారం పోటీలు ప్రారంభం కాగా మొదటి రెండు రోజులు బాలబాలికల జట్ల మధ్య 40లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. గురువారం జరిగిన లీగ్‌మ్యాచ్‌లో గెలుపొందిన టీమ్‌లు బాలుర విభాగం నుంచి 4టీమ్‌లు, బాలికల విభాగం నుంచి 4టీమ్‌లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. నేడు ఉదయం జరిగే సెమీఫైనల్ పోటీల్లో గెలుపొందిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటుండగా మధ్యాహ్నం జరిగే ఫైనల్ మ్యాచ్‌లతో పోటీలు ముగియనున్నాయి.

భీమన్న సేవలో చేరిన ఎస్‌పీఎఫ్ పోలీసులు

- బందోబస్తు పరిశీలించిన కమాండెంట్ జంగయ్య

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమేశ్వరాలయంలో ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బంది విధుల్లో చేరింది. గురువారం ఆలయంలో భద్రతను ఎస్‌పిఎఫ్ కమాండెంట్ జంగయ్య, ఆలయ ఈవో రమాదేవి పరిశీలించారు. అనంతరం కమాండెంట్, ఇవోలు భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్స్, 10మంది కానిస్టేబుళ్లకు భీమన్న సన్నిధిలో విధులు కేటాయించామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన భద్రతా సిబ్బంది స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు డి.తిరుపతిరెడ్డి, మహేందర్, ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, గొట్టం గిరిలు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ అమలు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఉద్యోగులకు బయోమెట్రిక్ అమల్లోకి తీసుకువచ్చారు. గురువారం భీమేశ్వర సదన్‌లోని ఈవో కార్యాలయంలో నెలకొల్పిన బయోమెట్రిక్ విధానంలో హాజరును ఈవో రమాదేవి పరిశీలించారు. ఆలయంలో దాదాపు 150మంది మినిస్ట్రీయల్, నాలుగో తరగతి ఉద్యోగులు, మరో 20 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 150మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. ఇకనుంచి రాజరాజేశ్వ రాలయం, భీమేశ్వరాలయంలో పనిచేసే ఉద్యోగులందరికి బయోమెట్రిక్ యంత్రం ద్వారా హాజరు చేసుకునే పద్ధతి అమలులోకి తీసుకువచ్చారు.





విధుల్లో చేరిన ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఈవో రమాదేవి, బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలిస్తున్న ఈవో

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అప్పన్నపేట విద్యార్థి ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న హెచ్‌ఎం పురుషోత్తం

పెద్దపల్లి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో ఎంపికకి మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్‌పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పంబాల అశ్విత ఎంపికైనట్లు పీడీ సురేందర్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో ఈనెల 28నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలలో అశ్విత పాల్గొంటున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి రూ. ఐదు వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ

సుభాష్‌నగర్/భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో ఐదు వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ మత్స్య కార్మికుల నాలుగో రాష్ట్ర మహాసభ, ముకుందలాల్ మిశ్రా భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మత్స్య సొసైటీకి పది లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేటికి మత్స్య వృత్తిపై ఆధారపడి కుటుంబాలు ఉపాధి పొందుతున్నా యన్నారు. రాష్ట్రంలో సుమారు 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో ఐదు లక్షల 60 వేల మంది మత్స్య సహకార సంఘాల సభ్యులుగా ఉన్నార న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మాఫియా పెద్ద ఎత్తున చెరువులు కుంటలు జల వనరుల ఉనదీ పరి వాహక ప్రాంతాల భూములను కబ్జాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూములను శాటిలైట్ ద్వారా సర్వే చేయించి హద్దులు తీయించి ఫెన్సింగ్ వే యాలన్నారు. జలవనరులను కబ్జాలు కాలుష్యం నుంచి విముక్తి కల్పించి మత్స్య వృత్తిని కాపాడాలన్నారు. గత ప్రభుత్వంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో భారీ అవినీతి జరిగిందని విమర్శించారు.

మత్స్యకార సొసైటీ అకౌంట్‌లో నగదు జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ రుణాలు నిలిపివేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీడీ రుణాలను మత్స్య సహకార సంఘాలకు నేరుగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సంక్షేమ ఫలితాలను పారదర్శకతతో అవినీతి లేకుండా అమలు చేయాలని కోరారు. 33 జిల్లాల మత్స్య సహకార సంఘాల ఎన్నికలు నిర్వ హించాలని, డిమాండ్ చేశారు. సమావే శంలో రాష్ట్ర అధ్యక్షుడు గొరింకల నరసిం హ, ఉపాధ్యక్షుడు పగడాల నాగేశ్వరరావు, దీటి శ్రీనివాసరావు, గాండ్ల అమరావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, భక్కి బాలమణి, చంద్రి పుష్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టల వెంకటేష్, జునగరి గణేష్, కోశాధికారి పప్పు సదానంద, నగర అధ్యక్ష, కార్యదర్శులు మద్రి శశికళ, నాగుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ

మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ...

ఈ సందర్భంగా తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోరెంకల నర్సింహా, లెల్లెల బాలకృష్ణ, 19 మంది ఆఫీస్ బేరర్స్, 51 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నాడు ఎన్నికలకు దూరం.. నేడు సై..

- తీరిన గొల్లపల్లి వాసుల సమస్య..
- ఎన్నికలకు సిద్ధం అవుతున్న ప్రజలు
- ఏడు సంవత్సరాలుగా ప్రత్యేకాధికారుల పాలన



గొల్లపల్లి గ్రామం

ఇల్లంతకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చేసిన పొరపాటు వల్ల ఆగ్రామపంచాయితీకి పాలకవర్గం లేకుండా పోయింది. ఇల్లంతకుంట మండలంలోని గొల్లపల్లి గ్రామపంచాయతీని ప్రభుత్వం రెండు గ్రామపంచాయతీలుగా మార్చింది. వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామపంచాయితీలుగా ఆవిర్భావం చెందాయి. అప్పటి అధికారులు గొల్లపల్లికి చెందిన 150మంది ఓటర్లతో పాటు ఇళ్లు, వ్యవసాయ భూములను వెంకట్రావుపల్లె పరిధిలోకి వచ్చేలా చేశారు. దీనిపై గొల్లపల్లి గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. 2019 జనవరిలో ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. గొల్లపల్లి గ్రామ పంచాయతీని బీసీకి కేటాయించారు. తమ ఓటర్లను తమ గ్రామపంచాయతీలో కలిపితేనే ఎన్నికలకు వెళతామని గొల్లపల్లి గ్రామస్థులు పట్టుబట్టారు. దీనితో సర్పంచ్, వార్డుస్థానాలకు ఎవరు నామినేషన్లు వేయలేదు. ఎన్నికలు జరగకుండా పోయాయి. అనంతరం ఫిబ్రవరిలో మరోసారి గొల్లపల్లి గ్రామపంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లాస్థాయి అధికారులు గ్రామానికి చేరుకొని నచ్చజెప్పారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది చేత నామినేషన్లు వేసేలా ప్రోత్సహించారు. నామినేషన్ల ఉపసంహరణ రోజు మరోసారి ఏకమైన గ్రామస్థులు అందరు ఉపసంహరించుకున్నారు. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలో గొల్లపల్లి గ్రామపంచాయతీ కొనసాగింది.

ఓటర్లను గ్రామంలో కలపడంతో..

చివరకు ప్రభుత్వం గ్రామానికి చెందిన ఓటర్లను తిరిగి గొల్లపల్లి గ్రామపంచాయతీలో కలిపారు. దీనితో ఈసారి ఎన్నికలకు గొల్లపల్లి గ్రామపంచాయతీ సిద్ధం అవుతోంది. గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చింతలకుంటపల్లె గ్రామం కూడా వస్తుంది. గ్రామపంచాయతీలో ప్రసుత్తం 324మంది పురుష, 298మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 622మంది ఓటర్లు ఉన్న గొల్లపల్లి గ్రామపంచాయతీని ప్రస్తుతం ఎస్సీ మహిళకు కేటాయించారు. ఈనెల 14న జరిగే ఎన్నికల బరిలో నిలిచేందుకు గ్రామస్థులు సిద్ధం అవుతున్నారు. తమ సమస్య పరిష్కారం కావడంతో ఎన్నికలకు వెళ్తున్నామని పేర్కొంటున్నారు.

రుద్రంగి మండలంలో... నాలుగు సర్పంచ్ పదవులు ఏకగ్రీవం



వీరునితండాలో సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్థులు

రుద్రంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలంలో ఇప్పటివరకు నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల, వార్డుసభ్యులు నామినేషన్ల ప్రక్రియ జరుగుతోంది. గురువా రం ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. మండలంలోని గైదిగుట్ట తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్, వీరునితండా సర్పంచ్‌గా గుగులోత్ మంజుల, చింతమణితండా సర్పంచ్‌గా గుగులోత్ సిందూజ ఏకగ్రీవం అయ్యారు. రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారులు అధికారికంగా ప్రకటించవలసి ఉంది.

వాలీబాల్ పోటీల ఏర్పాట్లు పరిశీలన

సిరిసిల్ల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీల ఏర్పాట్లను కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బాలురు 10 జట్లు, బాలికలు 10 జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 3 వరకు ఈ క్రీడలు జరుగుతాయని తెలిపారు. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షు డు శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతంకింది శ్యాం, కోశాధికారి కోడం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ అకాడమి కోచ్‌లు పాల్గొన్నారు.



వాలీబాల్ కోర్టును పరిశీలిస్తున్న లక్ష్మణ్ , సభ్యులు

మండలానికి చేరిన ఎన్నికల సామగ్రి



గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో తరలుతున్న ఎన్నికల సామగ్రి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల ప్రకటన జారీ చేసి అన్ని ఏర్పాట్లను చేపట్టింది. మూడు విడతల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాల్లో మూడో విడత ఎన్నికలు జరనున్నాయి. గురువారం సిరిసిల్ల కలెక్టరేట్ నుంచి ఎన్నికల సామగ్రిని అధికారులు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయానికి తరలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కేటాయించి అక్కడకు సామాగ్రిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

అభ్యర్థుల ఎంపికపై కుస్తీ..

(5వ పేజీ తరువాయి)

పార్టీలో చర్చ జరుగుతోంది. జిల్లాలోని బోయినపల్లి మండలం చొప్పదండి నియోజవర్గంలో ఉంది ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇల్లంతకుంట మండలం మానకొండూరు నియోజకవర్గంలో ఉంది కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తూ ఉండడంతో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ఆసక్తిగానే చర్చ జరుగుతోంది.

ఎన్నికలపై విపక్ష బీఆర్‌ఎస్, బీజేపీల దృష్టి

పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు, రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, సహకార సంస్థల ఎన్నికల్లో కీలకంగా మారే పరిస్థితి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని విపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కూడా పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మద్దతు గెలిచినా, ఓటమిపాలైనా రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేటీఆర్ ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపైన సర్వే చేయించారు. జిల్లాలోని మండలాల ముఖ్య నాయకులతో సమీక్షలు నిర్వహించారు. వేములవాడ నుంచి ఇటీవల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూసిన చల్మెడ లక్ష్మీనరసింహారావు నియోజకవర్గంలో అభ్యర్థుల ఎంపిక, గెలుపు బాధ్యతలు కీలకంగా మారనున్నాయి. బీఆర్‌ఎస్ ప్రధానంగా కాంగ్రెస్ వైఫల్యాలు పల్లెల్లో ప్రచారం చేయాలని వ్యూహాత్మకంగా కనిపిస్తున్నారు. మరోవైపు బీజేపీ జిల్లాలో తన ఉనికిని చాటుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంటు పరిధిలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉండడంతో పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కూడా చర్చ మొదలైంది. ఇటీవలనే బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డబోయిన గోపిని నియమించారు. వేములవాడ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన చెన్నమనేని వికాస్‌రావుపై వేములవాడ నియోజకవర్గంలోని మండలాల సర్పంచుల గెలుపు బాధ్యతలు ప్రధానంగా ఉండబోతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు ఎంతవరకు ప్రభావం చూపుతోందనే ఆసక్తి జిల్లా ప్రజల్లో కనిపిస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

- మృతుల కుటుంబ సభ్యులను పరామార్శించిన మాజీ ఎంపి



మృతుల కుటుంబ సభ్యులను పరామార్శిస్తున్న వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం సంభవించిందని మాజీ ఎంపి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం వేములవాడ మండలంలోని ఆరెపల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దంపతుల మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రి వద్ద పరిశీలించి, కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన లారీలను రాష్ట్రంలో నడుపుతున్నారన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాహనం వల్ల జరిగిన ప్రమాదంలో దంపతులు మృతి చెందారని, 16మాసాల చిన్నారి తీవ్ర గాయాలపాలైందన్నారు. లారీ డ్రైవర్ అతిగా మద్యం సేవించి వాహనం నడపడం వల్లనే ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు నిర్ధారించారన్నారు. రాష్ట్రంలో అనుమతి లేకుండా తిరుగుతున్న వాహనాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబసభ్యులకు పరిహారం అందజేయాలన్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భుజం నొప్పితో శస్త్ర చికిత్స చేయించుకున్న మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ గురువారం పరామర్శించారు. వెంట మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రవీణ్, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి, నాయకులు పర్శరాములు, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

పీపుల్స్‌వార్ మాజీ దళకమాండర్ సిద్దయ్య దారుణ హత్య

- జగిత్యాల పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు



సిద్దయ్య (ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పీపుల్స్‌వార్ పార్టీ మాజీ దళ కమాండర్ సిద్దయ్య అలియాస్ బాపురెడ్డి హత్యకు గురయ్యారు. వేములవాడ మండలం అగ్రహారం గుట్టల్లో గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచే సుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ బాపురెడ్డి అలియాస్ సిద్దయ్య (67) అనే పీపుల్స్‌వార్ మాజీ దళ కమాండర్‌ను ఓ యూట్యూబ్ చానల్‌లో ఇంటర్వ్యూ తీసుకుంటామని అగ్రహారం గుట్టల్లోకి పిలిచి హత్యకు పాల్పడ్డారు. సిద్దయ్యను హత్యచేసిన నిందితుడు నేరుగా జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో లొంగిపో యాడని సమాచారం. జగిత్యాల ప్రాంతంలో అప్పటి పీపుల్స్‌వార్‌లో పనిచేసినపుడు సిద్దయ్య 1997లో తన తండ్రిని హత్య చేసినందుకు ప్రతీకారంగా నింది తుడు సంతోష్ హత్యకు పాల్పడ్డాడు. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అప్పటి పీపుల్‌వార్ దళనాయుడిగా చేసిన ఉదంతాలను సిద్దయ్య చెప్పడంతో అది చూసిన నిందితుడు హత్యకు పాల్పడ్డాడని తెలుస్తోంది. గురువారం సిద్ధన్నను ఇంటర్వ్యూ పేరిట అగ్రహారం గుట్టల్లోకి పిలిచిన నిందితుడు మద్యం తాగించి బండరాయితో మోది దారుణంగా హత్యచేశాడు. అనంతరం నిందితుడు జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. గతంలో సిద్ధన్న సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, జగిత్యాల ప్రాంతంలో పీపుల్స్‌వార్ దళనాయకుడిగా పనిచేసి 20 సంవత్సరాల క్రితం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అప్పటినుంచి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జగిత్యాల పోలీసులు వేములవాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐ రామ్మోహన్ మృతదేహాన్ని పరిశీ లించి దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు అడ్డాగా పశు వైద్యశాల భవనం

- ధ్వంసమైన ప్రధాన గేటు - గదుల్లో దెబ్బతిన్న ఫ్లోరింగ్ - ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రైతులు



ధ్వంసమైన పశు వైద్యశాల భవనం గేటు



భవనంలో పగిలిపోయిన టైల్స్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని పశు వైద్యశాల భవనం నాణ్యత లోపంతో కుంగిపోయింది. పట్టించుకునే వారు లేక అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. భవనం ప్రధాన గేటు ధ్వంసమవడంతో రక్షణ లేకుండాపోతోంది. నిత్యం మందుబాబులు పశు వైద్యశాల భవనం ఆవరణలోకి చేరుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. భవనం ఆవరణలోని పరిసరాలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది.

కుంగిన భవనం.. వైద్య సేవలకు ఇబ్బంది..

రాచర్లతిమ్మాపూర్ గ్రామ పరిధిలోని రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, బాకురుపల్లితండాల్లోని పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 2014లో రూ.14లక్షల ఐఏపీ నిధులను కేటాయించింది. పనులను దక్కించుకున్న గుత్తేదారు గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో భవన నిర్మాణ పనులను చేపట్టారు. నాణ్యత లేమి వల్ల భవనంలోని గదులు కుంగడంతో ఎక్కడ చూసినా పగిలిపోయిన ఫ్లోరింగ్ టైల్స్ దర్శనమిస్తున్నాయి. వైద్య సేవలు అందించేందుకు ఇబ్బందికరంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. నీటి పైపును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఆవరణలో మద్యం సీసాలు, భవనంలోని గదుల నేల ధ్వంసమవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పశు వైద్యశాలకు గేటును బిగించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గేటుకు మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం

- శ్రీనివాస్, పశువుల సంరక్షణ అధికారి



రాచర్లతిమ్మాపూర్‌లోని పశువైద్యశాల గేటు ధ్వంసమవడం వల్ల గుర్తు తెలియని వ్యక్తులు చేరి మద్యం తాగుతున్నారు. గతంలో పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లాం. భవనంలోని గదులు నేల కుంగిపోవడం వల్ల టైల్స్ పగిలిపోయాయి. విధులు నిర్వహించేందుకు కొంత ఇబ్బందవుతోంది. వ్యాధులు సోకిన పశువులు, జీవాలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ధ్వంసమైన గేటుకు మరమ్మతు చేయించి బిగిస్తాం.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



రుద్రంగిలోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్



నర్సింగాపూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ

రుద్రంగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే అనుమతించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని రాజన్న సిరిసిల్ల - జగిత్యాల జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టును ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురవారం తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే రుద్రంగిలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కేంద్రంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే సరిపడా సిబ్బంది ఉన్నరా అని అడిగి తెలుసుకున్నారు. నోటీస్ బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా నామినేషన్ ప్రక్రియ నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలాంటి సందేశాలు ఉన్నా పైఅధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్, సీఐ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ మహేష్ బీ గితే

బోయినపల్లి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో 6 చెక్ పోస్టులు తంగాలపల్లి(జిల్లెళ్ల), గంభీరావుపేట(పెద్దమ్మ), ముస్తాబాద్ (వెంకట్రావ్‌పల్లి), వేములవాడరూరల్ (ఫాజుల్‌నగర్), బోయినపల్లి (నర్సింగాపూర్), రుద్రంగి (మానాల క్రాస్ రోడ్)లు ఏర్పాటు చేసి మద్యం, డబ్బు ఇతర అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. గురువారం బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును తనిఖీచేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి మద్యం,డబ్బు సరఫరా కాకుండా జిల్లాలో సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.చెక్ పోస్టుల వద్ద విధులలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ జిల్లాలోకి వచ్చే ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ మద్యం, డబ్బు రవాణా అడ్డుకట్ట వేయాలని చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పనిసరిగా ప్రతిఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని, తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా 50వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లినట్లయితే సీజ్ చేయాలని, అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు డబ్బులను తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో డబ్బులు తీసుకెళ్లాలని సూచించారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవడం ఉత్తమమని, ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇల్లంతకుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడుక్వేస్ట్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఎంఈవో చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు తిరుపతి, మహేష్‌చంద్ర, ఇంగ్లీష్ టీచర్లు మంద పద్మలత, భూక్యకవిత పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలను నిర్వహించారు. రాచర్లగొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వంజరి సాయిసహస్ర ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైందని ఇన్‌చార్జి హెచ్‌ఎం స్వామి పేర్కొన్నారు.

● వేములవాడ : వేములవాడ ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రాజరత్నం తెలిపారు. విద్యార్థులను ఎంఈవో కిషన్ ఉపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, సలాం, సరిత, శ్రీధరచారీ, సునిత, అరుణలు అభినందించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి..

ఎల్లారెడ్డిపేట, నవంబరు27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని బీజేపీ మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశంలో నాయకులు గణేశ్, నరేశ్, లక్ష్మారెడ్డి, బాలగౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాకలో గురువారం సీఐటీయు జిల్లా మహాసభల కరపత్రాన్ని హమాలి కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రావణపల్లి మల్లేశం ఆవిష్కరించారు. పండుగ రామాంజనేయులు, ప్రశాంత్, రాజు, చంద్రయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై పోలీసుల వివక్షత

ఇల్లంతకుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకులపై పోలీసులు వివక్షత చూపుతున్నారని మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకుడు మామిడి హరీష్ బుధవారం వ్యక్తిగత పనికోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఎస్సై నోటీసుపై సంతకం చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని లేనట్లయితే రిమాండ్ చేస్తానని బెదిరించారన్నారు. గతంలో మండల కేంద్రంలో పీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేస్తే కార్యక్రమంలో పాల్గొనని వారుపేర్లను సైతం ఎఫ్ఐఆర్‌లో చేర్చారన్నారు. అదేరోజు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసుపెట్టలేదన్నారు. సమావేశంలో నాయకులు మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, మామిడి హరీష్, పినకాసి అనీల్, తుమ్మనపల్లి కమలాకర్ రావు, కూనబోయిన బాలరాజు, కూనబోయిన కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ముస్తాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. గురువారం స్థానిక ఎఎంఆర్ గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థులుగా పోటీచేసే వారి జాబితాను తీసుకు న్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

తంగళ్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్రం కోట్లాది రుపాయాలు నిధులు వెచ్చిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండల బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై గ్రామపంచాయతీ ఎన్నికలపై దిశ నిర్దేశం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించకుండా అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఈజీఎస్ ద్వారా అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణం తదితర అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ ఏడాది కేవలం తంగళ్లపల్లి మండలంలో సుమారు 1.50 కోటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు, అలాగే బండి సంజయ్ ఎంపీ నిధుల నుంచి 15 బోరు బావులు ఏర్పాటు చేశారన్నారు. ఎంపీ నిధుల నుండి రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు జరిగాయని గుర్తు చేశారు. బండి సంజయ్ ఎంపీగా గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నాడని, గ్రామ పంచాయతీలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు. నిధులు లేవని ముఖ్యమంత్రి ప్రకటించాడని, అందుకే కాంగ్రెస్‌ను దూరం పెట్టి గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కు మద్దతు పలకాలని కోరారు. ఏకగ్రీవంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థిని ఎన్నుకున్న గ్రామ పంచాయతీలకు ఎంపీ నిధులు రూ.10లక్షలు మంజూరు చేస్తామని ఎంపీ బండి సంజయ్ ప్రకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ఇన్‌చార్జీ దుమాల శ్రీకాంత్, మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, నాయకులు రాజు, లింగారెడ్డి, వినయ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

గంభీరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం సరస్వతిదేవి విగ్రహాన్ని విద్యార్థులతో ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాంప్రసాద్, చేపూరి కిషన్, పంతులవారి పద్మ, చాత్రబోయిన దేవరాజు విద్యార్థులు ఉన్నారు.

సాహిత్య సదస్సుకు విద్యార్థుల కవితల ఎంపిక

గంభీరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల కవితలు ఉత్తర అమెరికా తెలుగు సంఘం వారు నిర్వహించే సాహిత్య సదస్సుకు ఎంపికయ్యాయి. విద్యార్థులు రిషిక పద్యం, రాజశేఖర్ వచన కవితల విభాగాల్లో ఎంపికైనట్లు ఉపాధ్యాయులు నరేందర్, రాజయ్యలు తెలిపారు. నవంబరు 30న ఇంటర్నెట్‌లో వీరు తమ కవితలను వినిపించనున్నారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంటి గంగరాం, ఉపాధ్యాయులు అభినందించారు.

టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా హన్మాండ్లుగౌడ్

కోనరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న విక్కుర్తి హన్మాండ్లు గౌడ్ టీఆర్టీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన నాయకులకు హన్మాండ్లుగౌడ్ కృతజ్ఞత తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీలో చేరిక

రుద్రంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ పార్టీలో గురువారం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మాజీ డీసీసీ కార్యదర్శి తూమ్ రవీందర్‌కు అలాగే బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు భగవాత్ గంగాధర్‌లకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సమక్షంలో చేరగా వారికి కండువ కప్పి ఆహ్వానించారు. వీరితో పాటు పలువురు చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మణ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం ఎన్నిలక నియమావళిపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎలాంటి గొడవలకు దిగవద్దని అన్నారు. ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్ఐ లక్ష్మణ్ కోరారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు27(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో శ్రీలేఖ వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నియమావళిపై గురువారం అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ లక్ష్మణ్, ఆయా పార్టీల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలో డీఎస్పీ దంపతుల పూజలు

వేములవాడ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలో డీఎస్పీ చల్లా దేవరెడ్డి, పద్మ దంపతులు గురువారం పూజలు చేశారు. వారికి వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదం అందజేశారు.

అధికారులపై ఇన్‌చార్జి కలెక్టర్ ఆగ్రహం



కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

రుద్రంగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవణంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ కేంద్రాన్ని రుద్రంగి గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేయగా ఇన్‌చార్జి కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెత్త, ప్లాస్టిక్ డబ్బలను తొలగించాలని కార్యదర్శికి సూచించారు.

కోడ్ ఉల్లఘించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉల్లఘించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్ సావనపల్లి రాకేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం గ్రామపంచాయతీ ఎన్నికల కంట్రోల్ రూంలో ఎమ్మెల్యే కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జీవో 46తో బీసీలకు అన్యాయం

ముస్తాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46తో బీసీలకు అన్యాయం చేయాలని చూస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించి కాంగ్రెస్ పార్టీ బీసీలను నమ్మకద్రోహం చేసిందని మండిపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా ఎలక్షన్‌లకు పోవడం బీసీలను మోసం చేయడమేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఈర్ల శ్రీనివాస్, విజయేందర్, మాచర్ల బాలయ్య, ఈర్ల కనుకయ్య తదతరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలు షురూ..

కోనరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లు గురువారం ప్రారంభమయ్యాయి. మం డలంలో ఎనిమిది నామినేషన్ సెంట ర్లను ఏర్పాటుచేసి పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. కాగా మొదటి రోజు సర్పంచ్ అభ్యర్థులు 16 మంది నామినేషన్లు దాఖలుచేయగా,12 వార్డు లకు వార్డు సభ్యులు దాఖలు చేశారు.

● రుద్రంగి : మండలంలోని స ర్పంచ్, వార్డులకు గురువారం నామినే షన్లు దాఖలు చేశారు. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 4 నామినేషన్లు, వార్డుసభ్యుల స్థానాలకు 5 నామినేష న్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

● చందుర్తి : మండలంలో 8 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవులకు 13 నామినేషన్లు, 7 గ్రామపంచాయతీల్లో వార్డు సభ్యుల పదవులకు 11 నామినేషన్లు దాఖలు అయినట్లు అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ రాధ గురువారం తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు పదవులకు ఎన్నికలు జరుగుతున్నందున నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటిరోజు గురువారం నామినేషన్లు ప్రారంభం కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చందుర్తి సీఐ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలంలోని 11గ్రామపంచాయతీలకు ఏర్పాటుచేసిన 5నామినేషన్ కేంద్రాలలోని రుద్రవరం, సంకెపల్లి గ్రామసర్పంచ్ స్థానాలకు ఒక్కో నామినేషన్ దాఖలైంది. మిగితా 9 గ్రామాల్లో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. మండలంలోని రుద్రవరం, చింతల్‌ఠానా, మారుపాక, చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో నామినేషన్ సెంటర్‌లు ఏర్పాటుచేశారు. మండలంలోని అయిదు నామినేషన్ కేంద్రాల వద్ద ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు.